


# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## అమ్మాయి మనసు

**వర్షకి జీవితం హాయిగా** గడిచిపోతోంది. సీతారాం సంబంధం వచ్చినప్పుడు మధ్యవర్తి మాటలు విని భయపడింది.

"అబ్బాయి తల్లితండ్రులకి ఒక్కడే కొడుకు. ఉద్యోగం చేసే అమ్మాయి వద్దన్నారు. ఉమ్మడి కుటుంబంలోనే ఉండాలి. పెళ్ళయ్యాక వేరుకాపురం అంటే కుదరదు."

తండ్రి అన్నిటికి తపూపుతుంటే కోపంగా తల్లిని లోపలికి పిలిచి అడిగింది.

"ఏంటి అంత సంబరపడిపోతున్నారు? జాయింట్ ఫేమిలీ ఐతే నో. నేను జాబ్ చేద్దామనుకుంటున్నా పెళ్ళయ్యాక" చెప్పింది.

ఆవిడ కూతుర్ని ఎగాదిగా చూసి "నువ్వొచ్చావు అని వాళ్ళని ఎక్కడికి వెళ్ళమంటాం? పెళ్ళికొడుకు ఆకాశంలోంచి రాడు. అమ్మానాన్నలకే పుడతాడు. నీ బిఏ డిగ్రీకి ఎవడు జాబిస్తారు? ఇస్తే నిక్షేపంగా ఇప్పటినించీ చేయరాదు?"

"నేను నీ కన్న కూతుర్నేనా? కూతుర్ని సపోర్ట్ చేయవే?" వర్ష అరిచింది.

"పెద్దమ్మాయ్? ఏంటి గొడవ?" బయటనించి తండ్రి పిలుపు వినిపించింది. తల్లి వంక క్రోధంగా చూస్తూ చెప్పింది.

"ఏం లేదు నాన్నా."

సీతారాం అందగాడు. ఆల్ ఇండియా రేడియోలో పనిచేస్తున్నాడు. హైద్రాబాద్‌లో తల్లితండ్రులతో కలిసి ఉంటాడు. వర్ష కొంచెం భయంగానే కాపురానికి వచ్చింది. అత్తగారింట్లో అన్నీ పద్దతి ప్రకారం జరగాలి. పొద్దున్నే ఇంటిముందు ముగ్గేయాలి. స్నానం చేసికాని వంటగదిలోకి వెళ్ళకూడదు. ఇంకా ఇలాంటి చిన్న చిన్న చిన్న నిబంధనలున్నా, త్వరలోనే అలవాటు పడిపోయింది. సీతారాం తండ్రి రుక్మిణీనాథం వృద్ధుడు. ఆయనకి నలభై ఐదో ఏట పుట్టాడు సీతారాం. భార్య 1యనకంటే పదేళ్ళు చిన్నది.

కాపురానికి వచ్చిన నెలరోజులకల్లా వర్షకి ఆ ఇల్లు, ఇంట్లోని మనుషులగురించి అర్థమైపోయింది. రుక్మిణీనాథంకి కొంచెం చాదస్తం ఎక్కువ. కాని వాటితో ఇతరులని ఇబ్బంది పెట్టడు. ఇంగ్లీష్ మందులంటే కోపం. తన బిపి, సుగర్‌లకి ఆయుర్వేదమే వాడతాడు. తలనొప్పికి కూడా ఆయన సారిడాన్ లాంటివి వాడలేదంటే వర్ష ఆశ్చర్యపోయింది. అత్తగారు కల్పవల్లి సరదా మనిషి. ఆవిడకి అన్నీ సరదానే. ఈ నెలరోజుల్లోనూ వర్ష ఆవిడ మొహంలో విసుగు, చిరాకు, కోపంలాంటివి చూడలేదు. ప్రతీదానికి అరుస్తూండే అమ్మకంటే ఈవిడ ఎంత మంచిది అని చాలాసార్లు అనుకుంది. సీతారాం అతిమంచి భర్త. మంచి పెంపకం అని మనసులో అత్తమామలకి చాలాసార్లు థాంక్స్ చెప్పింది. వర్ష ఉదయం నిద్రలేచి కిందికి వచ్చేసరికే వాళ్ళిద్దరూ వరండాలో కూర్చుని ఉంటారు. ఆయన పేపర్ చదువుతూ అందులోని విశేషాలని ఆవిడకి చెప్తూంటాడు. ఆవిడ అవి వింటూ, కామెంట్స్ చేస్తూ చిక్కుడు కాయలకి ఈనెలు తీయడమో, ఆకుకూరలు వలవడమో చేస్తూంటుంది. సీతారాం ఆఫీస్‌కి వెళ్ళాక వంటలో అత్తగారికి సహాయం చేస్తుంది. కానీ ఆవిడ పెద్దగా పనులు చెప్పదు. చకచకా నాలుగు స్టవ్‌ల మీద నాలుగు పెట్టి గంటలో వంట చేసేస్తుంది.

భోజనాలయ్యాక వాళ్ళిద్దరూ ఓ గంట నిద్రపోతారు. వర్షపైన తమ బెడ్రూంలోకి వెళ్ళి టి.వి చూడడమో, పుస్తకాలు చదవడమో ఫ్రెండ్స్‌తో ఫోన్‌లో మాట్లాడడమో చేస్తూంటుంది.

సాయంత్రం ఐదుకి వాళ్ళు టీ తాగి ఇంటి ఆవరణలోని మొక్కలకి నీళ్ళు పట్టడంలాంటి పనులు చేస్తారు. తర్వాత ఆవిడ టి.వి ముందు కూర్చుంటే ఆయన వాకింగ్‌కి వెళ్ళివస్తాడు. వాళ్ళు కలిసి ఉన్నంతసేపు ఏవో కబుర్లు చెప్పుకుంటూనే ఉంటారు. అప్పుడప్పుడూ ఆయన వల్లీ అంటూ సరస సంభాషణ చేయడం, ఆవిడ సిగ్గుపడడం వర్ష గమనించింది.

'ఎంత చీకూ చింతా లేకుండా ఉన్నారు? అమ్మా నాన్న ఇలా ఉండచ్చుగా' అనుకునేది.

"కొత్త పెళ్ళికూతురివి. ఈ నెలరోజుల్లో మా ఇంట్లో అలవాటు పడ్డావా? అంతా బానే ఉందిగా? ఎలాంటి అసౌకర్యం లేదుగా?" నెలరోజుల తర్వాత ఓ రాత్రి సీతారాం అడిగాడు.

"అంతా బావుంది. ఒక్క మీ పేరు తప్ప" వర్ష చెప్పింది.

సీతారాం పెద్దగా నవ్వి అడిగాడు.

"సీతా రాం కి ఏమైంది? మంచిపేరేగా?"

"పాతపేరు కదా? త్రేతాయుగం నాటిపేరు."

"వర్షం ఈ మధ్యే కురుస్తోందా కొత్తగా? ఐనా నాది దేవుడి పేరు. అంతమంచివాడిని కాకపోయినా ఒకటి రెండు గుణాలైనా అబ్బాలని ఆ పేరు పెట్టారు. నీ పేరు వర్ష. అంటే వాన. అదో చర్య. నీ తమ్ముడు ఆకాష్. మీ చెల్లి మేఘ. ఇవన్నీ ప్రకృతి. నేను సీతారాంని అవగలను కానీ నువ్వు వర్ష, మీ చెల్లెలు మేఘం, మీ తమ్ముడు ఆకాశం కాలేరుగా? నాకీ ఆధునిక పేర్లు అర్థంకావు. సరస్వతి అని పేరు పెట్టుకోవడం, కూతురు చదువుల తల్లి అవాలని ఆశతో, మరి శిశిర అనే పేరుని ఎందుకు పెట్టుకుంటారు?" సీతారాం అమాయకంగా అడిగాడు.

"మీరు అమాయకంగా కనిపించే గడుగ్గాయ్" వర్ష ముద్దుగా విసుక్కుంది.

సీతారాం ఆరోజు ఎప్పటిలా ఆఫీస్ నించి రాగానే స్నానం చేసి, వర్ష ఇచ్చిన కాఫీగ్లాస్‌తో వచ్చి తండ్రి పక్కన కూర్చున్నాడు. అది వారి దినచర్య. ఆఫీస్‌నించి వచ్చాక సీతారాం తప్పనిసరిగా తల్లిదండ్రుల దగ్గర కూర్చుని ఆ రోజు విశేషాలు చెప్తాడు, వింటాడు. వర్ష ఆ సమయంలో రాత్రి వంటకి కూరలు తరగడం లాంటి పనులు చేస్తూ వంటింట్లో

బిజీగా ఉంటుంది. రాత్రి ఎనిమిదిన్నరకి భోజనాలయ్యాక వాళ్ళు పైకి వెళ్ళిపోతే, మళ్ళీ తెల్లారేదాకా ఏకాంతమే. అత్తామామలు ఏమైనా కావాలన్నా మెట్ల దగ్గర నిలబడి పిలుస్తారు కానీ పైకి రారు. ఈ రొటీన్ వర్షకి ఎంతో బావుంది.

"నాన్నా. నాకు ప్రమోషన్ వచ్చింది" సీతారాం నెమ్మదిగా చెప్పాడు.

"అంత మెల్లిగా చెప్తావేం? కోడలు వచ్చిన వేళావిశేషం" కల్పవల్లి సంతోషంగా చెప్పింది.

"ప్రమోషన్‌తో గోవాకి ట్రాన్స్‌ఫరైంది నాన్నా."

"గోవానా?" రుక్మిణీనాథం మొహం అప్రియంగా పెట్టాడు.

"అవును. అక్కడ మనకి అకామడేషన్ ఇస్తారు. పెద్ద ఇల్లేవుంటుంది" సీతారాం మృదువుగా చెప్పాడు.

వంటగదిలోంచి ఈ మాటలు విన్న వర్ష ఆనందంతో ఉక్కిరిబిక్కిరైంది. గోవా! గోవాలో కాపురం అంటే ఆమెకి ఆ క్షణమే రెక్కలు కట్టుకుని ఎగరాలని అనిపించింది. ఇక్కడికిలా ప్రతీ వీకెండ్ 'ఎక్కడికి వెళ్దాం' అని వెతుక్కోనక్కర్లేదు. హాయిగా బీచ్‌కి వెళ్ళిపోవచ్చు. సీతారాం ఒప్పుకుంటే అప్పుడప్పుడూ కేసినోకి కూడా వెళ్ళచ్చు.

"జీతం ఏమాత్రం పెరుగుతుందేమిటి?" రుక్మిణీనాథం అడిగాడు.

"జీతం కన్నా బెనిఫిట్స్ ఎక్కువున్నాయి నాన్నా.." సీతారాం తండ్రి అయిష్టాన్ని గమనించి చెప్పాడు.

"మేము రాములే. నువ్వూ కోడలు వెళ్ళండి" రుక్మిణీనాథం చెప్పాడు.

"అదేంటి నాన్నా? మీరు లేకుండానా?" సీతారాం తెల్లబోయాడు.

"అంతా పాశ్చాత్య పోకడ. నాకు నచ్చదురా అబ్బాయ్. ఈసారికి ఇలా కానీ" ఆయన స్థిరంగా చెప్పాడు.

"ఐతే ప్రమోషన్ వద్దని చెప్తాను" సీతారాం నెమ్మదిగా చెప్పాడు.

"అలాంటి పిచ్చి పని చేయకు. తలని అమ్ముకున్నాక వాళ్ళు ఎక్కడికి పొమ్మన్నా పోవాలి. అమ్మా నేనూ ఉంటాంలే మీరు వెళ్ళండి."

సీతారాం మారు మాట్లాడలేదు. వంటగదిలోని వర్షకి ఆనందంతో ఎగిరి గంతులు వేయాలనిపించింది. అత్తామామలు రాకపోతే తను ఎంచక్కా గోవన్స్‌లా పూలగౌన్లు వేసుకోవచ్చు. ఏదైనా చిన్న ఉద్యోగం చూసుకోవాలి గో గోవాలో' అనుకుంది. ఆ ఆనందాన్ని ఆ రాత్రి సీతారాంతో పంచుకుంది.

"ఎప్పట్లోగా వెళ్ళి చేరాలి కొత్త ఉద్యోగంలో?" అడిగింది.

"ఫస్ట్ నించి జాయినవ్వాలి. నాన్న మరీ పట్టుదలగా ఉన్నారు. వాళ్ళు లేకుండా నేను వెళ్ళలేను.

"రేపు మళ్ళీ నచ్చ చెప్పి చూడండి. "నేను కూడా అత్తయ్యతో చెప్తా" ఓదార్చింది.

మర్నాడు వంటగదిలో అత్తగారితో చెప్పింది.

"అత్తయ్యా మనందరం గోవా వెళ్ళిపోవచ్చుగా? మళ్ళీ ఎప్పుడు హైదరాబాద్ ట్రాన్స్‌ఫర్ వస్తే అప్పుడు వచ్చేద్దాం. మామయ్యగారికి నచ్చచెప్పండి ప్లీజ్. లేదా ఆయన ప్రమోషన్ తీసుకోరట."

"నాకూ ఊళ్ళు చూడడం ఇంట్రెస్టే వర్షా. ఆయనకి చెప్పి చూస్తాను" ఆవిడ చెప్పింది.

సాయంత్రం దాకా వర్ష చాలా అశాంతిగా గడిపింది.

సీతారాం తండ్రిని బెరుగ్గా అడిగాడు.

"ఏమంటారు నాన్నా?"

"నిన్నే చెప్పాగా? మీరు వెళ్ళండి. నేను అమ్మ ఇక్కడే ఉంటాం" ఆయన ఖచ్చితంగా చెప్పాడు.

సీతారాం నిస్సహాయంగా చూసి చెప్పాడు.

"సరే. వర్షని కూడా ఇక్కడే వదిలి వెళ్తాను. మీరిద్దరూ పెద్దవాళ్ళు. అర్ధరాత్రి, అపరాత్రి ఏదైనా అవసరం వస్తే తోడుంటుంది."

వింటున్న వర్ష గుండె ఆగినట్లయింది.

'వద్దొద్దు. పాపం ఆ అమ్మాయిని వదిలి వెళ్ళడం ఏమిటి? ఇద్దరూ వెళ్ళండి" ఆయన ఒప్పుకోలేదు.

సీతారాం లేని నిలబడి చెప్పాడు.

"వెళ్తే అంతా వెళ్దాం. లేదా నేనొక్కడినీ వెళ్ళి నెలకోసారి వస్తూంటా"

రుక్మిణీనాథం మౌనంగా ఉండిపోయాడు.

వర్షకి కాలం గడవడంలేదు. ఇదివరకు సాయంత్రం అవుతోందంటే సీతారాం వస్తాడని ఆనందంగా ఉండేది. ఇప్పుడు పగలు రాత్రి ఒకేలా ఉన్నాయి. రోజూ రాత్రుళ్ళు సీతారాంతో మాట్లాడుతూ కన్నీళ్ళు పెట్టుకుంటుంది. 'ఇందుకేనా నన్ను పెళ్ళి చేసుకుంది?' అని దెబ్బలాడుతుంది. 'నావల్ల కావట్లేదు' అని ఏడుస్తుంది.

సీతారాం ఆమెకి నచ్చచెప్పే ప్రయత్నం చేస్తాడు. ఓదార్చుతాడు. ఒక్కోసారి నిస్సహాయంగా మౌనం వహిస్తాడు.

కాలం దొర్లిపోతోంది. సీతారాం నెలకోసారి వచ్చిపోతున్నాడు. వర్ష చిక్కి సగమైంది. ఆమె బాధని గమనిస్తున్న కల్పవల్లి భర్తకి ఎదురు చెప్పలేక ఆయనకి నచ్చచెప్పడానికి ప్రయత్నిస్తోంది. కానీ రుక్మిణీనాథంలో ఏ మార్పూ లేదు.

ఆ రోజు సాయంత్రం కాఫీలు కలుపుతున్న వర్షకి ఆ ఆలోచన వచ్చింది. తన చేతిలోని షుగర్ ఫ్రీ టేబ్లెట్స్ సీసావంక ఓసారి నిశితంగా చూసింది. పంచదార సీసాలోంచి ఓ స్పూన్ పంచదారని కాఫీగ్లాస్‌లో వేసి, ఓ టేబ్లెట్‌నికూడా వేసి బాగా కలిపి మామగారికి ఇచ్చింది.

రుచిలో తేడా గమనించని ఆయన కాఫీ మొత్తం తాగి గ్లాస్ పక్కన పెట్టాడు.

ఆ రాత్రి వర్షకి పాపభీతితో నిద్రపట్టలేదు. కానీ మామగారి మీద గూడు కట్టుకున్న ద్వేషం ఏమాత్రం తగ్గలేదు. 'తను మంచిపనే చేస్తోంది' అనుకుంది.

ప్రతీ సాయంత్రం కాఫీలో పంచదార వేసిస్తోంది. ఆయన తాగేస్తున్నాడు. మధ్య మధ్యలో పాయసం, స్వీట్స్ వండుతోంది.

ఆ నెల సీతారాం వచ్చినప్పుడు రుక్మిణీనాథం చెప్పాడు.

"ఈ మధ్య కాళ్ళు విపరీతంగా నొప్పులురా. వాకింగ్‌కి కూడా వెళ్ళలేకపోతున్నా."

"మనమోసారి డాక్టర్ దగ్గరకి వెళ్దాం నాన్నా. షుగర్ ఎక్కువైందేమో" సీతారాం చెప్పాడు.

"అక్కర్లేదురా. రోజూ మధునాశన్ కేప్సూల్ వేసుకుంటూనే ఉన్నా. ఇంగ్లీష్ మందుకంటే బాగా పనిచేస్తుంది" ఆయన నిరాకరించాడు.

"కనీసం టెస్ట్ చేయిద్దాం నాన్నా. ఎంతుందో తెలుస్తుందిగా."

"వద్దొద్దు. నాకు సూదంటే భయం."

సీతారాం ఆయనకి నచ్చ చెప్పలేకపోయాడు.

ఆ తర్వాత ఆయన చిన్న చిన్న శారీరక అసౌకర్యాలు గమనించినా డాక్టర్లు, టెస్ట్‌లు అంటే విముఖతతో ఎవరికీ చెప్పలేదు.

సీతారాం వెళ్ళిన ఆర్నెల్లకి ఓ రాత్రి కల్పవల్లి మెట్లకిందనించి పెద్దగా అరిచింది.

"వర్షా. అమ్మా వర్షా."

అర్ధరాత్రి ఆ అరుపులకి మెలకువ వచ్చిన వర్ష వేగంగా మెట్లు దిగివస్తూ అడిగింది.

"ఏమైంది అత్తయ్యా?"

"మీ మామగారు తేడాగా ఉన్నారమ్మా. నాకేంటో భయంగా ఉంది" ఆవిడ వణికే కంఠంతో చెప్పింది.

వర్ష ఆవిడ వెనకే వారి పడగ్గదిలోకి వెళ్ళింది. రుక్మిణీనాధం పెద్దగా గురకపెడ్తున్నాడు.

"ఆయనకి గురకపెట్టే అలవాటు లేదు వర్షా." కల్పవల్లి ఏడుస్తూ చెప్పింది.

వర్ష గ్లాస్‌లోని నీళ్ళని ఆయన మొహాన చల్లి మృదువుగా తుడిచింది. గురక ఆగింది. ఆయన కళ్ళు తెరుచుకున్నాయి. కానీ కనుపాపలు పైకిపోయి తెల్లటి భాగమే కనిపిస్తోంది. వర్ష భయంతో కల్పవల్లి చెయ్యి పట్టుకుంది. కల్పవల్లి బిగ్గరగా ఏడవసాగింది.

రుక్మిణీనాధం పోయిన పదిహేను రోజులకి సీతారాం తల్లితో చెప్పాడు.

"అమ్మా. నా సెలవైపోయింది. అంతా కలిసి వెళ్ళిపోదాం. ఇంక ఇక్కడేం మిగిలింది. "

కొడుకు మాటలకి కల్పవల్లి కుమిలి కుమిలి ఏడ్చింది. తర్వాత చెప్పింది.

"సరే. మీ మొగుడూ పెళ్ళాలని విడదీసిన పాపానికి దేవుడు మమ్మల్ని విడదీసాడు. వెళ్ళిపోదాం. వర్షా 'సామాను సర్దమ్మా. అబ్బాయితో వెళ్ళిపోదాం."

వర్ష అత్తగారిని కౌగిలించుకుని ఏడుస్తూ చెప్పింది.

"మిమ్మల్ని పువ్వుల్లో పెట్టి చూసుకుంటా అత్తయ్యా. మాతోనే మీరు. మీకు ఏ కష్టం రాకుండా కన్నకూతుర్లా చూసుకుంటా. నన్ను నమ్మండి."

రెండు రోజుల తర్వాత్య వర్ష అత్తగారి చెయ్యి పట్టుకుని గోవాలో విమానం దిగింది.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments